# నష్ట పరిహారం

"మాలేగావ్‌లో బాంబు పేలుళ్ళు"

ఆఫీసులో నలిగిపోయి సబర్బన్ రైలు ప్రయాణంలో దస్సిపోయి ఇంటికి వచ్చిన ఆంజనేయులుకు పై వార్త స్వాగతం పలికింది. రెండేళ్ళ క్రితం ముంబయి సబర్బన్ రైళ్ళల్లో జరిగిన ఎనిమిది వరుస బాంబు పేలుళ్ళు జ్ఞప్తికి వచ్చాయి. ఒళ్ళు జలదరించింది. మనసింకా కకావికలం అయింది. ఇటీవల బెంగుళూరు, జైపూర్, ఢిల్లీ, అహ్మదాబాద్ పేలుళ్ళ విధ్వంస దృశ్యాలు కళ్ళ ముందు కదలాడాయి.

అన్య మనస్కంగానే స్నానం చేసి భోజనానికి కూర్చున్నాడు. టి.వి.లో ఇంకా మాలేగాం బాంబు పేలుళ్లతో నష్టపోయిన వారి గురించే చెబుతున్నారు. ఆ దృశ్యాలు చూస్తే, ఆంజనేయులుకు ముద్దదిగలేదు. అంత ఆకలి, అలసటలోను భోజనం సయించలేదు. రమణితో గ్లాసు పాలు తెప్పించుకుని తాగి తన భోజనం అయిందని పించాడు.

పడుకున్నాడన్నమాటే కాని, వివిధ ప్రదేశాల్లో జరిగిన బాంబు పేలుళ్ల దృశ్యాలే కళ్ళ ముందు కదలాడుతున్నాయి. కలత నిద్ర, మనసంతా ఏదో శూన్యం. మనం ఎటుపోతున్నాం? ఇలాంటి భీభత్స చర్యల వల్ల వాళ్ళకు ఒరిగేదేమిటి? జవాబులేని ప్రశ్నలు.

మర్నాడు పేపర్లో చూస్తే ఆ ప్రమాదం నివారించదగినదని తేలింది. మోటర్ సైకిల్ మీద పెట్టిన టిఫిన్‌బాక్స్ అనుమానాస్పదంగా ఉండడంతో ఎవరో పోలీసులకు ఆ వార్త చేరవేశారట, కాని వారు ఏ చర్యా తీసుకోలేదట. వారి నిర్లక్ష్యం ఎన్నో ప్రాణాలను బలి తీసుకుంది.

మృతులకు, గాయపడిన వారికి ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించిందని వార్త.

"చూశావా రమణీ! భద్రతకై చేసిన హెచ్చరికను పెడచెవిన పెట్టిన ప్రభుత్వం ఇప్పుడు నష్టపరిహారం ప్రకటించింది. రెండేళ్ళ క్రితం రైళ్ళల్లో జరిగిన బాంబు పేలుళ్ళు కూడా నిఘా సంస్థల హెచ్చరికను పెడచెవిన బెట్టడం వల్లే జరిగాయి. ఇప్పుడదే పునరావృతమైంది. మృతులందరి కుటుంబాలకు నష్టపరిహారంగా ఇచ్చే డబ్బులో సగమైనా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లకు వెచ్చిస్తే ఇన్ని కుటుంబాలు విచ్ఛిన్నం అవకపోను గదా!" భార్య చేతిలో నుండి టీ కప్పు తీసుకుంటూ అన్నాడు ఆంజనేయులు.

"నిజమేనండీ మన ప్రభుత్వాలెప్పుడూ చేతులు కాలాక ఆకులు పట్టుకుంటాయి. సినిమాల్లో చూస్తాంగదా! హత్యలు, నేరాలూ, ఫైటింగులు అన్నీ ఐంతర్వాతే గదా పోలీసులు రంగ ప్రవేశం చేసేది! మన ప్రభుత్వ అలసత్వానికి అసలైన ప్రతీకలు వారు."

"జీవితం సినిమా కాదు రమణీ. ప్రజల బాగోగులు, రక్షణ, బాధ్యత ప్రభుత్వానిదే గదా? అదే తన ధర్మం విస్మరించినపుడు సామాన్యులకు దిక్కేది? ప్రకటించిన నష్టపరిహారం కూడా సకాలంలో అసలు బాధితులకు అందుతుందనే గ్యారంటీ ఏదీ?"

"గ్యారంటీని ప్రక్కన పెట్టండి. నాకు తెలీకడుగుతానూ, డబ్బు, మనిషికి ప్రత్యామ్నాయం అవుతుందటండీ? కుటుంబ పెద్ద అకాల మరణంతో కలిగే లోటు ఏ డబ్బు తీరుస్తుందండీ? మనిషి విలువ డబ్బుతో ముడిపడి ఉందేమో కాని అది ఎంతమాత్రం చనిపోయిన మనిషిలోటును పూడ్చలేదు."

"అవును రమణీ! ప్రభుత్వం తన అసమర్ధతను కప్పిపుచ్చుకోవడానికి కంటి తుడుపు చర్యగా నష్టపరిహారం ప్రకటిస్తుంది. దానితో లేని సమస్యలు పుట్టుకొస్తాయి. కుటుంబంలో కలతలు, కలహాలు ఏర్పడతాయి. అసలే చితికిపోయిన కుటుంబం ఇంకా విచ్ఛిన్నం అవుతుంది."

"మన ఊళ్ళో సీతయ్య కుటుంబం అలాగే చెల్లాచెదురై పోలేదూ? వరదలతోనో, పురుగులతోనో, పంట చేతికి రాక నాలుగు సంవత్సరాలుగా చేసిన అప్పులు తీర్చలేక

సీతయ్య ఆత్మహత్య చేసుకున్నాడు. పొలానికి పట్టిన చీడను చంపడంలో విఫలమైన పురుగుల మందు, సీతయ్యను చంపడంలో మాత్రం సఫలమైంది! ప్రభుత్వం ఆర్నెల్లు తిప్పి, తిప్పి ఇచ్చిన నష్టపరిహారం కోసం అటు అప్పులవాళ్ళు, ఇటు అన్నదమ్ములు, భార్యాపిల్లలు! ఎంత రభస జరిగిందని? చివరికి అందిన కాడికి దండుకుని కుటుంబ సభ్యులు చెట్టుకొకరు పుట్టకొకరుగా చెదిరిపోయారు" రమణి తన ఊరుకు పరుగు దీసింది.

అంతదూరమెందుకు రమణీ? మొన్నటికిమొన్న బస్సు పేలుళ్ళ దగ్గర దొరికిన శవం, హక్కుదారుడు ముందుకు రాకపోవడంతో, మూడురోజులు మార్చురీలో ఉంది. పేపర్లో ఆ వార్త చూసిన ఓ శాల్తీ, ఆ శవం తన తండ్రిదని ఏవో రుజువులు చూపించి, ఆ శవానికి అంత్యక్రియలు జరిపాడు. గుండు గీయించుకుని నష్టపరిహారం దక్కించుకున్నాడు. నెల రోజుల తర్వాత ఇంకో వ్యక్తి ఆ శవం 'తన' తండ్రిదని ముందుకొచ్చాడు. పోలీసు దర్యాప్తులో రెండవ వ్యక్తే 'నిజం' కుమారుదని తేలింది. మొదటి వ్యక్తిపై మోసం కేసు నమోదు చేసి అతనిప్పుడు నష్టపరిహారం రాబట్టడానికి చెప్పులరగదీస్తున్నాడు. చెప్పేదేంటంటే, ప్రమాదాలేకాదు, ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం కూడా కుటుంబాలను అస్తవ్యస్తం చేస్తుంది." ఆంజనేయులు తేల్చాడు.

'అసలు, తమ మనిషే లేకపోయితర్వాత ఎంత డబ్బు వచ్చిపడితే ఏం ప్రయోజన మండీ. ఈ ఫోటో చూడండి.

'మాకు మీరిచ్చే డబ్బు వద్దు మా ఆయన్ని తెచ్చివ్వండీ అని ఎంత దీనంగా రోదిస్తోందో పాపం." రమణీ ఇచ్చిన దినపత్రిక చూడసాగాడు ఆంజనేయులు.

"ఇద్దరూ కలిసి పేపరు చదువుతున్నారు. ఏమైనా విశేషమా." ప్రక్కింటి రాజేశం వచ్చి మాటలు కలిపాడు.

"ఇంకేం విశేషాలండీ? నిన్నటి పేలుళ్ళ గురించీ, మృతుల కుటుంబాల అవస్థల గురించి చదువుతున్నాం. ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం గురించి చర్చిస్తున్నాం."

"ఈ నష్టపరిహారం కూడా బూటకమేనండి. అది బాధితులకు అందే సరికి ఎన్నో కమీషన్లు, ఎంతో సమయం ఖర్చవుతాయి. రాజ్యాంగంలో అందరూ సమానమే అంటారు గానీ, ఈ విషయంలో వర్గ విచక్షణ కొట్టొచ్చినట్టు కనిపిస్తుండండీ. రైతు ఆత్మహత్యకు లక్ష, బస్సు పేలుదులో మరణిస్తే అరలక్ష, రైలు ప్రమాదంలో చస్తే అయిదు లక్షలు, అదే విమాన ప్రమాదంలో అసువులు బాస్తే ఇరవై లక్షలు! ఇదండీ తీరు! ఎక్కడుందండీ సమానత్వం? అందుకే మా వాడు మొన్న పాడుతున్నాడు.

'కొడితే కొట్టాలిరా సిక్స్ కొట్టాలీ.

చస్తే చావాలిరా ప్లేన్ బ్లాస్టలో' రాజేశం వ్యాఖ్య.

"రాజేశం గారూ! మీరు ప్రతీదీ తేలికగా తీసుకుంటారు. బాంబు పేలుళ్ళ బాధితులను గురించి కాస్త ఆలోచించండి. ఆంజనేయులు సీరియస్ అయ్యాడు.

"అది నేను ఏడవలేక చేసిన వ్యాఖ్య. రెండు సంవత్సరాల క్రితం మన ప్రక్క బిల్డింగులోని మునిస్వామి రైలు పేలుడులో చనిపోయాడు. వారి కుటుంబానికింకా నష్టపరిహారం అందలేదు. వారు కొత్తగా ముంబయి వచ్చారు. ఉండేది అద్దె ఇల్లు. ప్రభుత్వానికి కావలసిన రుజువులు, పత్రాలు వారి దగ్గరలేవు. మనకు తోచిన సలహాలు ఇచ్చాం, కాని వారి వెంటుండి రుజువుల సేకరణకి సహాయం చేద్దామంటే మన సొంత పనులకే సమయం లేదాయే!

ఇక్కడ మనం ఇంకో విషయం గమనించాలి. బాంబు పేలుళ్ళలో చనిపోయిన వారికి భారీగా నష్టపరిహారం ప్రకటిస్తున్నారు కానీ ప్రతి రోజూ ఎందరో రైలు ప్రమాదాల్లో చనిపోతున్నారు. వారికి కూడా న్యాయానికి నష్టపరిహారం ఇవ్వాలి కదా? కాని ఇవ్వరు. పైగా వారి మృతదేహం పొందడానికి కుటుంబ సభ్యులే జరిమానా చెల్లించాలి" రాజేశం ఆగాడు.

"ఏం? ఎందుకుని?" రమణి ప్రశ్న.

"రోజూ జరిగే ప్రమాదాలు, ప్రయాణీకుల నిర్లక్ష్యం మూలంగా జరుగుతున్నాయట! నిన్నటి పేలుళ్ళు ఎవరి నిర్లక్ష్యం వల్ల జరిగాయి? ప్రభుత్వ ద్వంద్వ ప్రమాణాలకు ఇంతకంటే మంచి తార్కాణం ఉందా? రోజురోజుకు పెరుగుతున్న రద్దీకి సరిపడే సబర్బన్ రైలు సేవలు పెంచుతున్నారా? లేదు. క్రితం వారం మా పని మనిషి పెనిమిటి డ్యూటీకి పోయే హడావిడిలో రైలు కమ్మీ పట్టుకుని ప్రయాణించాడు. తోపుడుకు తట్టుకోలేక చేయి వదిలాడు. ఇంకేముంది? వేగంగా నడిచే రైలు క్రిందపడి, ఓ చేయి, రెండు కాళ్ళు కోల్పోయాడు. దానికి బాధ్యులెవరు? వారికి కల్గింది నష్టం కాదా? ఆ కుటుంబాన్ని ఆదుకునే నాథుడేడీ? వారికి కూడా నష్టపరిహారం ప్రకటించడం ప్రభుత్వ బాధ్యతకాదా? రాజేశంలో ఆవేశం.

ప్రతి విషయాన్ని నవ్వులాటగా తీసుకునే రాజేశం విశ్లేషణతో ఆంజనేయులు అవాక్కయ్యాడు.

వాతావరణం తేలిక పరచడానికి రమణి చల్లని నీరు, వేడి టీ ఇచ్చింది. రాజేశం స్థిమితపడ్డాడు.

"ఆంజనేయులు గారూ! మన శాంతి భద్రతలను భంగం చేయడానికి కొన్ని విదేశీ శక్తులు కంకణం కట్టుకున్నాయి. డబ్బుకు దాసోహమనే అధికారులు, నాయకులు తమ స్వార్థసాధనకు అలాంటి విద్రోహశక్తులను చేరదీస్తున్నారు. మన ప్రాణాలను పణంగా పెడుతున్నారు. అలాంటి చేష్టల పర్యావసానమే నిన్నటి పేలుళ్ళు. మొన్న ఢిల్లీ పేలుళ్లు నిందితులతో జరిగిన పోరులో ఇద్దరు ఉగ్రవాదులతో పాటు ఓ ఇనిస్పెక్టరు కూడా అసువులు బాశాడు. అది బూటకపు ఎన్‌కౌంటరని సందేహం వెలిబుచ్చాడు ఓ పార్టీ 'పెద్ద' మనిషి. వారికి కేంద్ర ప్రభుత్వం దన్ను! నిన్నటి బాంబు పేలుళ్ళలో తన కొడుకును కోల్పోయిన తల్లి మాటలు చదివారా?

'బాంబు పేలుళ్ళ హృదయవిదారక దృశ్యాలు ముఖ్యమంత్రి పడకగది గోడల కంటించాలి. అవి వారికి సరైన భద్రతా చర్యలు చేపట్టమని గుర్తు చేస్తాయి. నిఘా సంస్థలు ఇచ్చిన సమాచారంపై నిర్లక్ష్య వైఖరికి తెరదించుతాయి'

"నిజమే! ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకుంటే ఎన్నో ప్రమాదాలను అరికట్ట వచ్చు."

రాజేశం మళ్లీ మంచినీళ్ళు త్రాగాడు.

"మీరన్నది వాస్తవమే, కాని మన దేశంలో అది సంభవమంటారా?" ఆంజనేయులు సందేహం.

"అసంభవం మాత్రం కాదు. ఓటు బ్యాంకు రాజకీయాలు చేసే నాయకులు ఇలాంటి ప్రమాదాలను తమకనుకూలంగా మలచుకుంటారు. హడావిడిగా ఘటనా స్థలాన్ని సందర్శించి మొసలి కన్నీళ్ళు కారుస్తారు. నష్టపరిహారం ప్రకటించి చేతులు దులుపుకుంటారు. మధ్యలో మనలాంటి వాళ్ళం తలలు బద్దలు కొట్టుకుంటాం. వాడిగా వేడిగా చర్చించుకుంటాం. కాని ప్రభుత్వ ఉదాసీన వైఖరి మార్చడానికి ఏ చర్యలూ తీసుకోం. వార్తా పత్రికలకు ఉత్తరాలు కూడా రాయం. ఈ క్రమం ఇలాగే సాగుతుంది. అవును కానీ, మనం పార్కుకెళ్ళే సమయం అయింది, బయలుదేరుదామా? ఆంజనేయులు అతన్ని అనుసరించాడు. రమణి టి.వి. పెట్టింది. అత్తాకోడళ్ళ జీడి పాకం సీరియల్లో మునిగిపోయింది.

వారి ప్రక్క బిల్డింగులోని ఉగ్రవాద చర్యల బాధుతులు మాత్రం, తమ జీవన రైలు ను మళ్ళీ పట్టాలపైకి ఎక్కించడానికి నానాతంటాలు పడుతున్నారు. బ్యూరోక్రసీ ఉట్టి మీదున్న నష్టపరిహారం అందుకోవడానికి చెప్పులు అరగదీస్తున్నారు. ఇంకా అప్పుల్లోకి కూరుకుపోతున్నారు.

జనజీవనం మాత్రం యథావిధిగా సాగుతుంది, ఇంకో బ్లాస్ట్ జరిగేదాకా!